క్లుప్తంగా

మాధవరంలో ఎస్టీలకు శ్మశాన వాటికను అప్పగించాలి



భీమవరంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: మాధవరం గ్రామంలోని ఎస్టీల శ్మశాన వాటికను వారికే అప్పగించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతి బాబు డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని సోమవారం భీమవరం ఆర్డీవో కార్యాలయం వద్ద కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం క్రాంతిబాబు మాట్లాడుతూ ఏళ్ల తరబడి మాధవరం గ్రామంలో జీవిస్తున్న ఎరుకలకు సర్వే నెం.380లో గల 1.59 ఎకరాల భూమిలో శ్మశానవాటిక ఉండగా ఆక్రమణలు కారణంగా శ్మశాన వాటికను ఉపయోగించుకోవడానికి వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం శ్మశానవాటికకు సర్వే చేసి ఎరుకులకు చెందిన భూమిని వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు, విజయ్, పురిటిగడ్డ జయమ్మ, చిన్నమర్తి శ్రీను, నెరుగొండల వయ్యేరు, సిహెచ్ వెంకన్న, చినమర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గసభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ పట్టణంలోని 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో 30మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేయాల్సి ఉండగా కేవలం 10 మందితో పని చేయించడం వల్ల కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితోపాటు గత 5 నెలలుగా జీతాలు మంజూరు చేయలేదన్నారు. వెంకటలక్ష్మి, సారమ్మ, దుర్గ, లక్ష్మి, ఏసమ్మ పాల్గొన్నారు.

తొలి సీఎన్జీ బైక్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రపంచంలో తొలి సీఎన్జీ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125 భీమవరం వరుణ్ బజాజ్‌లో సోమవారం స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ ఆటో వారు ప్రవేశ పెట్టిన గేమ్ ఛేంజర్ బైక్, ప్రపంచపు మొట్ట మొదటి సీఎన్జీ బైక్ ద్విచక్ర వాహన రంగంలో అద్భుతమైన ప్రయోగమన్నారు. కార్యక్రమంలో భీమవరం డీటీవో టి.ఉమా మహేశ్వరరావు, జీఎం సూర్య ప్రకాష్, సేల్స్ మేనేజర్ సాదత్ భాషా, బజాజ్ ఆటో సర్వీస్ మేనేజర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా శేషవేణి

ఆకివీడు: మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన గాలి శేషవేణి సోమవారం మర్యాద పూర్వకంగా జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారిని కలిశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని, డ్వాక్రా నిధులు సద్వినియోగం అయ్యే విధంగా సహకరించాలని అరుణకుమారి సూచించారు. సీసీ కాయల పద్మజ కూడా నూతనంగా బాధ్యతలు స్వీకరించి ఆమెను కలిశారు.

ఊరూరా శరన్నవరాత్రుల సందడి

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారు నవరాత్రి మహోత్సవాల్లో సోమవారం శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిషనర్ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

నాచువారి సెంటర్:
శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి దేవినవరాత్రి మహోత్సవాలను ఒంటెద్దుబళ్ల సంఘం వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సోమవారం శ్రీజోగులాంబ అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఫణీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో:
శ్రీరామపురం శ్రీకనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దేవి నవరాత్రి మహోత్సవాలు వైభోగంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సోమవారం బాల త్రిపురసుందరిదేవి అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

ఆర్యవైశ్య భవనంలో:
భీమవరం ఆర్యవైశ్య భవనంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ
వీరవాసరం: మండలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వీరవాసరంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, తోలేరులోని శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయం, రాయకుదురు, మడుగు పోలవరం, నవుడూరు, అండలూరు, తోకలపూడి, మత్స్యపురి, నందమూరి గరువు, చింతల కోటి గరువు పెరికిపాలెం, దూసనపూడి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో దుర్గమ్మను అన్నపూర్ణదేవిగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని భక్తులు తెల్లవారుజాము నుంచి అమ్మవార్ల దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



జోగులాంబ అలంకరణలో



బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో శ్రీజగన్మాత కనకదుర్గ అమ్మవారు



వీరవాసరంలో పూజలందుకుంటున్న అమ్మవారు



మహాలక్ష్మీ దేవి అలంకరణలో మావుళ్లమ్మ అమ్మవారు



వాసవీమాతను దర్శించుకుంటున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం శ్రీలక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజు అమ్మవారు శ్రీ ధైర్యలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీ చక్ర అభిషేకం భక్తులచే నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు భక్తులచే అష్టోత్తర శతనామార్చన ఆలయ ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

మహాచండీ దేవి అలంకరణలో అమ్మవారు
ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఐదో రోజు అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆకివీడు గ్రామ దేవత పెద్దింటి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మహా చండీదేవిగా అలంకరించి, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరీ సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలోనూ, వనువులమ్మ ఆలయంలోనూ అమ్మవారు చండీదేవిగా దర్శనమిచ్చారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు.



ధైర్యలక్ష్మి అమ్మవారి అలంకరణలో శ్రీలక్ష్మి అమ్మవారు →

వెలవెలబోయిన పీజీఆర్ఎస్



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

ఆకివీడు: అధికారుల బదిలీలతో పీజీఆర్ఎస్ కార్యక్రమం వెలవెలబోతుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులు ఒకరిద్దరే ఉన్నారు. మండలంలోని ఏఈ పీఆర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓ, ఆర్అండ్‌బీ, ఇతర శాఖల ఏఈలు, ఈఓపీఆర్‌డీ, ఎంఈఓ, ఇతర శాఖల అధికారులెవవరూ కార్యక్రమానికి హాజరుకాలేదు. తహసీల్దార్ ఎస్. వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారిణి ప్రియాంక, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీలు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో ట్రెయినింగ్‌కు వెళ్లగా, ఏఈలు పలువురు బదిలీ అయినే స్థానాల్లోకి ఆయా ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులు ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ చెప్పారు. మంచినీటి పైప్‌లైన్‌ను 10వ వార్డులో విస్తరింపజేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, కంకర రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ఆ వార్డులోని ప్రజలు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్థానిక 2వ వార్డులో సాయిదుర్గా నగర్‌లోని తన ఇంటికి 2021 ఏప్రిల్ నుంచి పన్ను కేటాయించలేదని, డిమాండ్ నోటీసులు ఇవ్వడం లేదని తన పేరు తప్పుగా నమోదయ్యిందని సర్వే నెంబర్ 251/2లోని ఇంటి యజమాని బండారు వెంకట పద్మారావు ఫిర్యాదు చేసినట్లు 3వ వార్డులోని ఉల్వర్తన్‌పేటలో బైపాస్ రోడ్డు వద్ద డ్రెయినేజీ నిర్మించాలని ఫిర్యాదులు అందాయన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఏటీవీ డిజైన్ అండ్ రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు వివరాలను విలేకరులకు తెలిపారు. ఐఎస్ఎన్ఈఈ మోటార్ స్పోర్ట్స్ జాతీయ స్థాయిలో ఫార్ములా ఆఫ్ రోడ్ మినీ బజా-2024 పేరిట గత నెల 27 నుంచి అక్టోబర్ ఒకటి వరకు వివిధ విభాగాల్లో పోటీలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో సాగర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ రీసెర్చ్ నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో ×టీం గోదావర్టి పేరిట తమ విద్యార్థులు వెహికల్ డిజైనింగ్‌లో దంగేటి శ్రీసాయి సుప్రీత్, సుడవల్లి చంద్రశేఖర్, బొగ్గవరపు శ్రీసాయి సూర్య దీప్, వాహనం డ్రైవర్స్‌గా రెడ్డి పూర్ణచంద్ర, ఎ.పుష్కర్ వికాస్ వర్మ, ఉత్తమ కెప్టెన్‌గా పాలుపూరి వెంకట దుర్గా సాయిరాం బహుమతులు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె.సురేష్‌బాబు, పి.రామ్మూర్తిరాజు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ ఎం.అనిల్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన ట్రస్టుకు విరాళం

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసి యున్న షిరిడి సాయిబాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి బొండాడకు చెందిన రామకృష్ణ ప్రసాద్ దంపతులు, సుబ్రహ్మణ్యం దంపతులు రూ.1,11,111 విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంత లక్ష్మీ సత్యవతీదేవి దాతలను శేషవస్త్రం, బాబా ప్రతిమతో సత్కరించారు.

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

భీమవరం: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల యొక్క అర్జీలను అడిషనల్ అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక్ల కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భర్త/అత్తారింటి వేధింపులు,జాబ్ మోసాలు, ఇతర సమస్యలపై అడిషనల్ ఎస్పీ 9 అర్జీలను స్వీకరించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

వీరవాసరం: మహిళలు స్వయం ఉపాధి పొందడానికి, కాపు బలిజ సంక్షేమ సేన కృషి చేస్తుందని ప్రణాళికా సంక్షేమసేన అధ్యక్షుడు సీనియర్ రాజకీయ నాయకుడు చేగొండి హరిరామజోగయ్య, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ కృషి చేస్తున్నారని సంక్షేమసేన నాయకులు గుండా రామకృష్ణ అన్నారు. వీరవాసరం మండలంలో సంక్షేమసేన వివిధ సంస్థల సహకారంతో ఇప్పటివరకు 150 పైగా కుట్టుమిషన్లను పంపిణీ చేశామన్నారు.

మద్యం షాపులకు 23 దరఖాస్తులు

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 22 మద్యం షాపులకు ఆఫ్‌లైన్‌లో 23 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా చాలా మంది వేసినట్లు తెలిసింది. ఈ నెల 9 లోపు మద్యం షాపులకు డిపాజిట్ చెల్లించి దరఖాస్తులు చేసుకోవలసి ఉంది. 11న డ్రా తీసి, 12న షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వనున్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విష్ణు విద్యార్థులు



భీమవరం విష్ణు కళాశాలలో ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఈనెల 6వ తేదిన తాడేపల్లిగూడెంలో వెస్ట్‌గోదావరి ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు బిహెచ్ నాయక్, టి ఉదయ్‌కిరణ్, ఎం ప్రశాంత్, కేపీ ఆర్య, ఎన్ ఆరిఫ్ ఎంపికయ్యారన్నారు. ఈనెల 8వతేది నుంచి మూడు రోజులుపాటు గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వేణు చెప్పారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, కోచ్ కె శివప్రసాద్ అభినందించారు.

ఐక్యతతో ముందుకు సాగాలి



యూపీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న బ్రదర్ జాన్సన్

ఉండి: సమాజంలో చెడును తొలగించేందుకు పాస్టర్లు, సేవకులు ఐకమత్యంతో ముందుకు సాగాలని యూపీఎఫ్ రాష్ట ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బ్రదర్ మేడిద జాన్సన్ అన్నారు. సోమవారం ఉండి మండలం పెద పుల్లేరు క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యూపీఎఫ్) మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవకులకు ఆర్థిక సహకారం, నూతన వస్త్రాలు, ఐడీ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. జాన్సన్ మాట్లాడుతూ యూపీఎఫ్ కమిటీలోని సభ్యులకు ఆర్థికంగానూ, వైద్య పరంగాను సేవలందించేందుకు తానెప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పాస్టర్ ఈలి డేవిడ్‌మార్కు, పాస్టర్ సోడదాసి వరదానం, సలహాదారు పాస్టర్ సామ్యూల్, నన్నేటి చంద్రబాబు, నీతిపూడి యోహాను, రాపాక జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: విద్యార్థులు చిన్ననాటి నుంచి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. విష్ణు విద్యా సంస్థలో నిర్వహిస్తున్న వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా వివిధ పోటీల్లోని విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. నేడు ప్రపంచమంతా భారత దేశంవైపు చూడ్డానికి ఇస్రో చేపట్టే ప్రయోగాలు కూడా ఒక కారణమన్నారు. ఇస్రో (ఎస్ఎంపీసీ) చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనలవైపు ఆసక్తి కనబర్చాలన్నారు. శాస్త్రవేత్తలుగా మారి దేశ ప్రగతికి దోహదపడాలని సూచించారు. అనంతరం అనలాగ్ ఆస్ట్రోనాట్ జాహ్నవి దంగేటి ఎ గర్ల్ జర్నీ ఇన్ టూ స్పేస్ అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో జె.ప్రసాదరాజు, పి.శ్రీనివాసరాజు, ఐ.ఆర్. కృష్ణంరాజు, ఎల్. బిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

పాలకోడేరు: పాలకోడేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నూకల మురళీ గంగాధర్‌రావు భీమవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వి.రెడ్డియ్య కృష్ణా జిల్లా పెడన నుంచి వచ్చారు. గతంలో రెడ్డియ్య పాలకోడేరు మండలానికి ఈవోపీఆర్డీగా పని చేశారు. ఈయన సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫిర్యాదును ఎలా మూసేస్తారు ?

పాలకోడేరు: పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై ఇచ్చిన ఫిర్యాదును విచారించకుండా మూసేసిన ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శిలపై చర్యలు తీసుకోవాలని మోగల్లు పంచాయతీ వార్డ్ మెంబర్ పెన్మెత్స వెంకటరాజు, తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాను గత నెల రెండో తేదీన మోగల్లు పంచాయతీలో జరుగుతున్న మూడు అక్రమాలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానని సదరు ఫిర్యాదును పంచాయతీరాజ్ శాఖకు పంపించినట్లు తనకు సమాచారం వచ్చిందని, అయితే దానిపై ఎలాంటి విచారణ చేయకుండా పాలకోడేరు మండల ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి బొక్కా జార్జిప్రసాద్ ఫిర్యాదును మూసేశారని పేర్కొన్నారు. వారిద్దరిపై తగు చర్యలు తీసుకోవాలని వార్డ్ మెంబర్, తదితరులు కోరారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

పాలకోడేరు: ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యచరణ ప్రణాళిక 2024-25 సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల సాధారణ కనీస పరిపాలన విధానం, పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామ పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణ, కోర్టు కేసుల్లో న్యాయమైన అంశాలపై అవగాహన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక, సంక్షేమ పథకాలు, మొదలగు అంశాలపై ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయతీలోని ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు చొప్పున ఖచ్చితంగా హాజరవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



సీపీఎం స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఆకివీడు: స్థానిక శ్రీనగర్ కాలనీలో మంచినీరు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మహాసభ విజ్ఞప్తి చేసింది. 5వ మహాసభ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం కార్యదర్శి పెంకి అప్పారావు మాట్లాడుతూ వార్డులోని గురుదత్త గుడి వెనుక ఉన్న మురుగు కాలువను మూలలంక బోదె వరకూ అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డోకల రవితేజ, షేక్ వలీ, దొడ్డి పద్మ, మువ్వా శ్రీను పాల్గొన్నారు.